క్లుప్తంగా

మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్



సుల్తానాబాద్: పట్టణానికి చెందిన మోంగని చంద్రశేఖర్‌ను మున్నూరు కాపు సంఘం మండలాధ్యక్షుడిగా నియామకం చేసినట్లు రాష్ట్ర కన్వీనర్ చింతపండు మనోహర్ పటేల్ ఉత్తర్వులను జారీ చేశారు. ఆదివారం నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. రైతుల సమస్యలతోపాటు విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉండి ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు



కమాన్‌పూర్‌లో నాయకుల సంబరాలు

కమాన్‌పూర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ విజయం సాధించగా.. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే ఆ పార్టీకి ప్రజల నుంచి వ్యతిరేకత మొదలైందన్నారు. బొమ్మగాని అనిల్, ఉప్పరి శ్రీనివాస్, నీటుం సరిత, పొన్నం రాజేశ్వరి, తాటికొండ శంకర్, కొండ వెంకటేశ్, ఆకుల గట్టయ్య, గుర్రం లక్ష్మిమల్లు, బొల్లపల్లి శంకర్, నీలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

ధర్మారం: నాయకంపల్లి గ్రామానికి చెందిన మైనేని మానస ఆత్మహత్యకు పాల్పడగా.. ఆమె కుటుంబానికి గ్రామ ఎంపీటీసీ బద్దం అజయ్‌పాల్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ నాయకులు నిత్యావసర వస్తువులు, నగదు అందించారు. మానస పదోతరగతిలో మార్కులు తక్కువగా వచ్చాయని జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంది. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న మానస కుటుంబానికి ఎంపీటీసీ సభ్యుడు నిత్యావసరాల వస్తువులు అందించగా.. కాంగ్రెస్ నాయకులు బద్దం నర్సింహారెడ్డి, ఎదుల్ల అంజయ్య, పూసాల మల్లేశం, బద్దం తిరుపతిరెడ్డి, అన్నాడి నర్సింహారెడ్డి, కల్లెం జల్పతిరెడ్డి, కోహెడ రవీందర్, నోముల గంగారెడ్డి నగదు అందించారు.

మానవ సేవే మాధవ సేవ



మజ్జిగ పంపిణీ చేస్తున్న కందుల సంధ్యారాణి

గోదావరిఖనిటౌన్: మానవ సేవే మాధవ సేవ అవుతుందని పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి అన్నారు. స్థానిక విశ్వకర్మ వీధిలో శ్రీభవానీ దీక్ష యజ్ఞ సేవాసమితి నిర్వాహకుడు కట్ట సురేష్ ఆధ్వర్యంలో నెల రోజులుగా కొనసాగుతున్న మజ్జిగ, పులిహోర పంపిణీ ముగింపు కార్యక్రమానికి ఆమె ఆదివారం హాజరై మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కొండపర్తి నరహరి, ప్రధాన కార్యదర్శి నగేశ్, రాష్ట్ర నాయకులు కొంకితార రమేశ్, ప్రభాకర్, కందుల పోచం తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం



సుల్తానాబాద్‌లో మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

సుల్తానాబాద్: పట్టణంలోని జవహర్‌నగర్‌లో ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధమైంది. నరహరి నర్సయ్య పశువుల కోసం పశుగ్రాసాన్ని నిల్వ చేశారు. ఇళ్ల మధ్యలో ఉండడంతో ఓ వ్యక్తి సిగరెట్ అంటించి అగ్గి పుల్లను పడేయడంతో.. పశుగ్రాసానికి నిప్పంటుకుంది. ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ సిబ్బందితో వచ్చి మంటలార్పారు. ఫైర్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బి.మహేందర్‌రెడ్డి, ఫైర్ కానిస్టేబుళ్లు శ్రవణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, కొట్టే శ్రీనివాస్, డ్రైవర్ చంద్రయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గోదావరిఖని: క్రిమిసంహారక మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మేకల శివ(26) అనే యువకుడు ఆదివారం మృతిచెందాడు. స్థానిక గంగానగర్‌లో నివాసముంటున్న శివ ఆర్థిక ఇబ్బందులతో గత నెల 15న క్రిమిసంహారక మందు తాగాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు వెల్లడించారు.

ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

జిల్లాలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లో పతాకావిష్కరణ చేసి తెలంగాణ రాష్ట్ర గేయాన్ని ఆలపించారు. అనంతరం మిఠాయిలు పంచారు. ఈ వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సుల్తానాబాద్‌రూరల్: పోలీస్ స్టేషన్‌లో జెండా ఆవిష్కరిస్తున్న సీఐ సుబ్బారెడ్డి



ధర్మారంలో..



గోదావరిఖని: జెండాకు గౌరవ వందనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట జెండా వందనం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి తదితరులు



రామగుండం: అంతర్గాం ఎంపీడీవో కార్యాలయంలో..



కాల్వశ్రీరాంపూర్ మండల పరిషత్ కార్యాలయ భవనంపై జెండా వందనం చేస్తున్న ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్ తదితరులు



ముత్తారంలో..



కమాన్‌పూర్: తహసీల్ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ ఆరిఫొద్దీన్



జూలపల్లిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎలిగేడు ఎంపీడీవో కార్యాలయంలో జెండా ఎగరేస్తున్న ఎంపీపీ స్రవంతి



పెద్దపల్లిరూరల్: జిల్లా గ్రంథాలయంలో జెండా వందనం చేస్తున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ తదితరులు



పెద్దపల్లిరూరల్: పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి



రామగిరి: మండల పరిషత్ కార్యాలయంలో జెండా ఎగరేస్తున్న ఎంపీపీ ఆరెల్లి దేవక్క



జ్యోతినగర్: కేక్ కట్ చేస్తున్న తెలంగాణ అమరుడు సత్యనారాయణ తండ్రి కొమురయ్య



యైటింక్లయిన్‌కాలనీ: జాతీయ జెండా ఎగరేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు



గోదావరిఖనిటౌన్: జాతీయ జెండాకు వందనం చేస్తున్న నాయకులు



గోదావరిఖని: జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు



గోదావరిఖని: అబ్దుల్‌కలాం స్టేడియంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

అమరుల త్యాగాల ఫలితమే రాష్ట్రం

గోదావరిఖని: అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం జీఎం కార్యాలయంలో జెండా ఎగరేసి గౌరవ వందనం చేశారు. అనంతరం కాగడాతో రన్ నిర్వహించారు. సింగరేణి ఉద్యోగులు సకల జనుల సమ్మెలో పాల్గొని ఉద్యమానికి ఊపిరి పోశారన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ రాష్ట్ర ప్రగతిలో సింగరేణి పాత్ర కీలకంగా మారిందన్నారు. జీఎం కార్యాలయం నుంచి యైటింక్లయిన్‌కాలనీ షిర్కేబస్టాప్ వరకు ర్యాలీ నిర్వహించి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు, నాయకుడు జిగురు రవీందర్, సీఎంవోఏఐ అధ్యక్షుడు మధుసూదన్, ఎస్‌వోటూ జీఎం ఎస్.వెంకటేశ్వర్‌రావ్, ఏరియా ఇంజినీర్ నరసింహరావ్, ఏరియా సేఫ్టీ అధికారి బచ్చ రవీందర్, డీజీఎం సివిల్ ధనుంజయ, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జెండాకు గౌరవ వందనం చేస్తున్న జీఎం సూర్యనారాయణ, అధికారులు

తెలంగాణ అభివృద్ధిలో సింగరేణి తలమానికం



మాట్లాడుతున్న ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు

రామగిరి: తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో సింగరేణి సంస్థ తలమానికమని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం సెంటినరీకాలనీ రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగాణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సేవాసమితి అధ్యక్షురాలు ఎన్.అలివేణితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఏరియాలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించారు. కోల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో గెలుపొంది పతకాలు సాధించిన ఆర్జీ–3, ఏపీఏ ఏరియా ఉద్యోగులను సత్కరించారు. తెలంగాణ కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎం.రాంచంద్రారెడ్డి, ఐఎన్‌టీయూసీ ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, ఎస్‌వోటూ జీఎంలు జి.రఘుపతి, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతువేదిక కార్యాలయంలో గుర్తుతెలియని దుండగులు

కాల్వశ్రీరాంపూర్: పెగడపల్లి గ్రామంలో రైతువేదిక భవనం కార్యాలయంలో శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు తాళం పగలగొట్టి ఫర్నీచర్ ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. రాష్ట్రావతరణ వేడుకల్లో భాగంగా ఆదివారం జెండా ఎగరేయడానికి వెళ్లిన ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసమైనట్లు గుర్తించారు. కాల్వశ్రీరాంపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



కార్యాలయంలో ధ్వంసమైన ఫర్నీచర్



గోదావరిఖనిటౌన్: గురువులతో పూర్వ విద్యార్థులు



జ్యోతినగర్: పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

గోదావరిఖనిటౌన్: స్థానిక మార్కండేయకాలనీలోని వాణీవిద్యావిహార్ హైస్కూల్‌లో 1998–99 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థినీవిద్యార్థులు ఆదివారం గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం, సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గురువులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. గురువులు మామిడాల రాజకుమార్, ప్రకాశ్, ఎం.శ్రీనివాస్, లలితాకుమారి, రమణ, విజయ్‌కుమార్, రమేశ్, మల్లేశం, గౌరీపార్వతి, పూర్వ విద్యార్థులు వి.శ్రీనివాస్, టి.అనిల్‌కుమార్, ఎస్.జగదీశ్, శ్రీదేవి, దీపక్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని విశ్వశాంతి హైస్కూల్ 2005–06 సంవత్సరానికి చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. హైస్కూల్ ఆవరణలో సమావేశమై చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. సురేందర్‌గౌడ్, అనురాధ, మధుసూదన్, సుదర్శన్, బొల్ల రమేశ్, కన్నూరి లక్ష్మణ్‌రావు, వెంకట్, ముజాహిద్, ప్రభాకర్, మామిడాల గణేశ్ పాల్గొన్నారు.

కాలిన బోరు మోటార్

చిత్ర కథ



కమాన్‌పూర్: పిల్లిపల్లెలో తాగునీరు సరఫరా చేసే బోరు మోటార్ కాలిపోవడంతో.. తాగునీటి కోసం జనం ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల క్రితం మోటార్ పని చేయడం లేదని గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తట్టుకోలేని ఎండకు.. తట్టు బొంతలే దిక్కు..



కోల్‌సిటీ(రామగుండం): జిల్లాలో పెరుగుతున్న ఎండల తీవ్రతకు పలువురు వాహనదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రామగుండం నగరం గరంగరంగా మారింది. తట్టుకోలేని ఎండకు గోదావరిఖనిలో కొందరు వాహనదారులు బైక్ సీట్లు, పెట్రోల్ ట్యాంకులపై తట్టు బొంత సంచులను నీళ్లలో తడిపి కప్పుతున్నారు. మధ్యమధ్యలో ఆ తట్టు బొంత సంచులపై నీళ్లు చల్లుతున్నారు. ఇలా చేస్తే పెట్రోల్ ఆవిరి కాకుండా తగ్గించుకోవచ్చని మెకానిక్‌లు సూచిస్తున్నారు.

పరామర్శ

కమాన్‌పూర్: జూలపల్లి ఆదర్శనగర్‌కు చెందిన బుద్దుల ఐలయ్య రెండు రోజుల క్రితం మృతిచెందగా.. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, ట్రినిటి విద్యాసంస్థల అధినేత దాసరి మనోహర్‌రెడ్డి ఆదివారం ఐలయ్య కుమారులు పర్శరాములు, తిరుపతి, రవీందర్‌లను పరామర్శించారు.